క్లుప్తంగా

ఎస్సైగా వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకరణ



ఎల్కతుర్తి : వరంగల్ సీపీ ఏవీ.రంగనాథ్ ఆదేశాల మేరకు భీమదేవరపల్లి మండలంలోని వంగర పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా ఎస్.వెంకటేశ్వర్లు శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. ఎలాంటి ఇబ్బందులున్నా ప్రజలు నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడతామని చెప్పారు. ఎస్సై వెంకటేశ్వర్లుకు పోలీసు సిబ్బంది పూలబొకే అందజేసి స్వాగతం పలికారు.

ఎస్సైకి అభినందన



దామెర : స్థానిక ఎస్సై ముత్యం రాజేందర్‌ను ఎమ్మార్పీఎస్ నాయకులు పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. తొలుత పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఎస్సైని కలసిన వారిలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గోవిందు రవికుమార్, మండల ఇన్‌చార్జ్ పరిమళ శ్రీధర్ తదితరులున్నారు.

హోమం



ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలంలోని మల్లారం గ్రామంలో శ్రీ తపాల లక్ష్మీనృసింహస్వామి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా రాజయోగి సిద్ధిశ్వర్ మహరాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీ లక్ష్మీనృసింహస్వామి కల్యాణం, 108 అష్టోత్తర శత గుండాత్మక మహాసందర్శన హోమం నిర్వహించారు. హనుమకొండ జెడ్పీ చైర్మన్ మారేపల్లి సుధీర్‌కుమార్ పూజలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వంగ రవి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మారుపాటి మహేందర్‌రెడ్డి, బీజేపీ నాయకులు జన్నారపు సురేందర్‌రెడ్డి, చాడ శ్రీనివాస్‌రెడ్డి, సామాజిక సేవకురాలు కర్ణకంటి మంజులరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



ఎల్కతుర్తి : మండలంలోని దండేపల్లి గ్రామానికి చెందిన బండారి రాజయ్యకు మంజూరైన రూ.60 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బోయినపల్లి దేవేందర్‌రావు శుక్రవారం అందజేసి మాట్లాడారు. రాజయ్య అనారోగ్యం బారిన పడి వైద్యం చేయించుకోగా సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆర్థికసాయం అందించినట్లు తెలిపారు. పేదలు సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు చిర్ర కొమురెల్లి, చదిరం వీరస్వామి, గునిగంటి రమేష్, కడారి పవన్‌కుమార్, కొంగ ప్రవీణ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్ల పంపిణీ



ఎల్కతుర్తి : బీజేపీ మండల అధ్యక్షుడు కుడితాటి చిరంజీవి దంపతులు వారి వివాహ వార్షికోత్సవం సందర్భంగా మండలంలోని చింతలపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. అనంతరం చిరంజీవి మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

దాడి కేసులో వ్యక్తి అరెస్ట్

ఖిలా వరంగల్: అన్నదమ్ముల ఆర్థిక లావాదేవీల విషయంలో పెద్దరికం చేసిన ఓ వ్యక్తిపై దాడి చేసిన కేసులో ఒకరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ తెలిపారు. వరంగల్ ఉర్సు కరీమాబాద్‌కు చెందిన గై రాజు, దేవేందర్ అన్నదమ్ముల మధ్య ఆర్థిక లావాదేవీల విషయమై గొడవలు జరుగుతున్నాయి. వారిద్దరు కలిసి సమీప బంధువైన వలిశెట్టి రవీందర్ వద్దకు వెళ్లారు. ఇరువురికి నచ్చజెప్పి గొడవను శాంతించే ప్రయత్నం చేయగా వలిశెట్టి రవీందర్‌పై గైరాజు కర్రతో దాడి చేయగా గాయాలయ్యాయి. మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గైరాజును శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

‘టెన్త్’లో మెరుగైన ఫలితాలే లక్ష్యం

- ఎస్‌సీఈఆర్‌టీ రాష్ట్ర పరిశీలకుడు ప్రొఫెసర్ డాక్టర్ మదీన్ అహ్మద్



ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న డాక్టర్ సయ్యద్ మదీన్ అహ్మద్

ఐనవోలు : పదో తరగతి విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడమే లక్ష్యంగా ప్రణాళికాయుతంగా చదవాలని నేషనల్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రెయినింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) రాష్ట్ర పరిశీలకుడు ప్రొఫెసర్ డాక్టర్ సయ్యద్ మదీన్ అహ్మద్ చెప్పారు. ఆ దిశగా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆయన సూచించారు. మండలంలోని పున్నేలు, ఐనవోలు జెడ్పీ హైస్కూళ్లను, కేజీబీవీని పరిశీలకుడు సయ్యద్ మదీన్ శుక్రవారం సందర్శించారు. పదో తరగతి బోధనను ప్రత్యక్షంగా తీరును పరిశీలించారు. విద్యార్థులకు ప్రశ్నాపత్రం గురించి అవగాహన కల్పిస్తున్న తీరుపై అడిగి తెలుసుకున్నారు. పరీక్షలకు సిద్ధం కావాల్సిన విధానాన్ని వివరించారు. మెళకువలను తెలిపేలా పలు అంశాల గురించి చెప్పారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయడానికి అవసరమైన పలు సలహాలు, సూచనలు చేశారు. విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించే దిశగా అధ్యాపకులు సమర్థవంతంగా బోధించడంతోపాటు కార్యాచరణతో పని చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ ఏ.శ్రీనివాస్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ పాత్రల వినియోగం మేలు

- ఎస్బీఎం జిల్లా ప్రతినిధి సంపత్‌కుమార్



స్టీల్ పాత్రల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఎస్బీఎం జిల్లా ప్రతినిధి సంపత్‌కుమార్

కమలాపూర్ : ప్లాస్టిక్‌కు బదులు స్టీల్ పాత్రలను వినియోగించడం మేలని స్వచ్ఛభారత్ మిషన్ (ఎస్బీఎం) జిల్లా ప్రతినిధి సంపత్‌కుమార్ స్పష్టం చేశారు. స్వచ్ఛభారత్ మిషన్ గ్రామీణ్–2లో భాగంగా మండలంలోని శంభునిపల్లి గ్రామంలో రెండో రోజు శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పారిశుధ్య సర్వే చేపట్టారు. అనంతరం గ్రామ సభ ఏర్పాటు చేసి ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై, స్టీల్ పాత్రల వినియోగంతో కలిగే లాభాలపై అవగాహన కల్పించారు. తదనంతరం సంపత్‌కుమార్ మాట్లాడారు. ప్రజలు ఆరోగ్య పరిరక్షణ, కాలుష్య నియంత్రణ కోసం పురాతన పద్ధతులు అలవాటు చేసుకోవాలని సూచించారు. స్టీల్ పాత్రలు వినియోగించాలని చెప్పారు. డీఎల్పీఓ రవిబాబు మాట్లాడుతూ విలేజ్ స్వచ్ఛత ప్లాన్ తయారు చేసి గవర్నమెంట్ ఆఫ్ ఇండియా (జీఓఐ) వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. సర్పంచ్ పెండ్యాల రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా మానేయాలని గ్రామస్తులను కోరారు. ప్రత్యామ్నాయంగా స్టీల్ పాత్రలను వినియోగించి ప్రజారోగ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమాల్లో ఎంపీఓ విమల, జేఈ శ్రీనివాస్, ఈజీఎస్ ఏపీఓ రమేష్, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పరకాలలో బీజేపీ విజయోత్సవం



బాణాసంచా కాల్చుతున్న నాయకులు, కార్యకర్తలు

పరకాల : ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ఏవీఎన్.రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందిన సందర్భంగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు స్థానిక బస్టాండ్ సెంటర్‌లో బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ ఆలేరు అసెంబ్లీ పాలక్, మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి మాట్లాడారు. అన్ని ఎన్నికల్లోనూ ప్రజలు బీజేపీకి పట్టం కట్టేందుకు ఎదురు చూస్తున్నారని తెలిపారు. హుజురాబాద్, ఇతర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలిచిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ మోసపూరిత విధానాలతో ప్రజలు విసిగి బీజేపీ వైపు చూస్తున్నారని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు ఉపయోగపడుతున్నాయని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఎస్‌పీఆర్టీయూ అభ్యర్థి గుర్రపు చెన్నకేశవరెడ్డికి సపోర్ట్ చేసినా టీయూపీఎస్ గెలిచిందన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని స్థానాల్లో బీజేపీ గెలుపు ఖాయమన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్పీ.జయంత్‌లాల్, జిల్లా కార్యదర్శి ఎర్రం రామన్న, పట్టణ ఇన్‌చార్జ్ మేకల రాజవీరు, ప్రధాన కార్యదర్శి కుక్కల విజయ్, కౌన్సిలర్ కొలనుపాక భద్రయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ మార్త రాజభద్రయ్య, సీనియర్ నాయకులు పిట్ల వీరస్వామి, ఉపాధ్యక్షులు పాలకుర్తి తిరుపతి, దార్ల నారాయణదాసు, మారేడుకొండ భాస్కచారి, ఆకుల రాంబాబు, బలభద్ర రాజు, పైండ్ల రంజీత్, సాయికృష్ణ, కానుగుల గోపీ, కోడెల లింగమూర్తి, గాజర్ల సదానందం, రాజు, అల్లె నరేష్, బొచ్చు సంపత్, అల్లె నవీన్, దూమల సూర్యం, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే సుపరిపాలన

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌చారి



కరపత్రాలు అందిస్తున్న శ్రీనివాస్‌చారి, తదితరులు

నడికూడ : టీడీపీ హయాంలోనే ప్రజలకు సుపరిపాలన అందిందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నోజు శ్రీనివాస్ చారి తెలిపారు. మండలంలోని పులిగిల్ల గ్రామం నుంచి ‘ఇంటింటికి తెలుగుదేశం’ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేస్తూ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. అనంతరం శ్రీనివాస్ చారి మాట్లాడారు. టీడీపీని పేదల సంక్షేమమే లక్ష్యంగా ఏర్పడ్డ పార్టీగా అభివర్ణించారు. టీడీపీ పాలనలో జరిగిన అభివృద్ధిని గ్రామస్థాయి నుంచి ప్రచారం చేసి పార్టీకి పూర్వవైభవం తీసుకురానున్నట్టు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాడాలని సూచించారు. పార్టీని అధికారంలోకి తీసుకొస్తే పేదరిక నిర్మూలన జరుగుతుందని తెలిపారు. రాబోయే రోజులలో పరకాల నియోజకవర్గంలో పార్టీ అభ్యర్థిని గెలిపించే దిశగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర రైతు ప్రచార కార్యదర్శి లక్కం ప్రకాష్, నాయకులు గంగబోయిన రవీందర్, రామన్న, దిలీప్, శివ, దిలీప్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

కేఎంటీపీకి ‘మిత్ర’లో చోటు!



- కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు మహర్దశ
- అంతర్జాతీయ ప్రమాణాలతో సౌకర్యాలకు అవకాశం

గీసుకొండ: జిల్లాలోని గీసుకొండ–సంగెం మండలాల పరిధి కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు(కేఎంటీపీ)కి కేంద్ర ప్రభుత్వం ‘మిత్ర’లో చోటు కల్పించింది. దీంతో పార్కులో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన వసతులు, సౌకర్యాలు కల్పించేందుకు మార్గం సుగమం కానుంది. ఇప్పటి వరకు కేవలం రాష్ట్ర ప్రభుత్వం కేఎంటీపీలో మౌలిక సదుపాయాలు కల్పించడానికి నిధులు ఖర్చు చేస్తోంది. మిత్రలో చోటు దక్కడంతో కేంద్రం ప్రత్యేక శ్రద్ధ తీసుకునే అవకాశం ఉంది. చైనా, వియత్నాం, ఇథియోపియా మాదిరిగా వస్త్రాల తయారీ, ఎగుమతుల్లో అగ్రగామిగా నిలవాలని భారత్ సంకల్పిస్తోంది. మెగా ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్, అండ్ అపెరల్(మిత్ర) పార్కులు నెలకొల్పే దిశగా కేంద్రం చేస్తున్న ఆలోచన తాజా నిర్ణయంతో కార్యరూపం దాల్చనుంది. ఇప్పటికే మడికొండలో 60 ఎకరాల విస్తీర్ణంలో కాకతీయ టెక్స్‌టైల్ వీవర్స్ కో–ఆపరేటివ్ సొసైటీ పార్కు అందుబాటులోకి రాగా.. కేఎంటీపీ కోసం ప్రభుత్వం సుమారు 1200లకు పైగా ఎకరాల భూసేకరణ చేసి పెట్టుబడులను పెట్టి వస్త్ర యూనిట్లను నెలకొల్పాలని పలు కంపెనీలను ఆహ్వానిస్తోంది. దీనికి తోడు మిత్రలో చోటు దక్కడంతో దేశ, విదేశీ కంపెనీలు కేఎంటీపీలో వస్త్ర పరిశ్రమను నెలకొల్పడానికి ముందుకు వచ్చే అవకాశం ఉంది.

‘మిత్ర’తో మహర్దశ..

మిత్ర పథకానికి అర్హత సాధించాలంటే సుమారు వెయ్యి ఎకరాల స్థలం ఉండాలి. దీనికి అనుగుణంగా కేఎంటీపీలో భూసేకరణ చేశారు. ఇప్పటి వరకు గణేశ్ ఎకోటెక్, ఎకోపెట్ కంపెనీ 50 ఎకరాల స్థలంలో యూనిట్లను నెలకొల్పి వాడిన ప్లాస్టిక్ బాటిళ్ల నుంచి యార్న్ తయారు చేస్తోంది. సుమారు 700 మంది ఇందులో పని చేస్తున్నారు. కేరళకు చెందిన చిన్నపిల్లల గార్మెంట్ల తయారీ కంపెనీ కై టెక్స్‌కు 187.24 ఎకరాల స్థలాన్ని కేటాయించగా.. షెడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈకంపెనీ రూ.1,013 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. పని చేయడం ప్రారంభిస్తే సుమారు 11 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. దక్షిణ కొరియాకు చెందిన యంగ్‌వన్ కంపెనీకి 261.83 ఎకరాలు కేటాయించగా.. రూ. 8,40 కోట్ల ఖర్చు చేయనుంది. ఇందులో సుమారు 12 వేల మంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందే అవకాశం ఉంది. సూరత్, బీవండి, షోలాపూర్ నుంచి తిరిగివచ్చే చిన్న చేనేత ఉత్పత్తిదారుల కోసం 135 ఎకరాలను కేటాయించగా.. రూ.10.78 కోట్లను ఖర్చు చేయడానికి ప్రతిపాదించారు. ఇవే కాకుండా.. పలు కంపెనీలు పెట్టుబడులు పెట్టి పార్కులో యూనిట్లను నెలకొల్పడానికి ముందుకు వస్తుండడం, వాటికి తోడు మిత్రలో కేఎంటీకి చోటు దక్కడంతో మరింత ఊతం లభించనుంది. పార్కులో మౌలిక సదుపాయాల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.1,100 కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించగా.. ఇప్పటి వరకు సుమారు రూ.500 కోట్లను ఖర్చు చేశారు.

కేంద్రం నిర్ణయం చాలా మంచిది

సూరత్, బివాండి, షోలాపూర్ నుంచి వచ్చిన చిన్న ఉత్పత్తిదారులకు కేఎంటీపీలో 135 ఎకరాలు కేటాయించారు. వీటిని ప్లాట్లుగా చేశారు. చాలామంది వంద శాతం డబ్బులు చెల్లించినా.. వారికి ప్లాట్లు కేటాయించలేదు. రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించలేదు. మిత్రలో చోటు దక్కడంతో త్వరగా మౌలిక వసతులు కల్పించే అవకాశం ఉంది.

– మస్న కుమారస్వామి,
దుర్గా శక్తి మల్టీ మెగా టెక్స్‌టైల్ ప్రెసిడెంట్

వరకట్న వేధింపులతో యువతి ఆత్మహత్యాయత్నం

దామెర : వరకట్న వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్యకు యత్నించిన ఘటన మండలంలోని తక్కళ్లపహాడ్ గ్రామంలో శుక్రవారం ఆలస్యంగా వెలుగుచూసింది. ఎస్సై ముత్యం రాజేందర్ కథనం ప్రకారం.. హసన్‌పర్తి మండలంలోని సిద్ధాపూర్ గ్రామానికి చెందిన గుమ్మడి వీరస్వామి కూతురు దేవికను దామెర మండలంలోని తక్కళ్లపహాడ్‌కు చెందిన కొత్తపల్లి శివకుమార్‌కు ఇచ్చి 2019లో వివాహం జరిపించారు. పిల్లలు కలగకపోవడంతో దేవికను భర్త శివకుమార్, మామ రాజేందర్, అత్త రజిత మానసికంగా, శారీరకంగా వేధింపులకు పాల్పడుతున్నారు. అదనపు కట్నం తీసుకురావాలంటూ ఏడాదిగా వేధిస్తున్నారు. ఈ క్రమంలో ఈనెల 13న దేవిక తల్లి రాజమణి, మేనమామ రాజు తక్కళ్లపహాడ్‌కు వెళ్లి దేవిక–శివకుమార్ దంపతులకు నచ్చజెప్పి వస్తుండగా దేవిక ఇంట్లోకి వెళ్లి గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. దీంతో దేవికను చికిత్స కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. దేవిక తండ్రి వీరస్వామి ఫిర్యాదు మేరకు శివకుమార్, రాజేందర్, రజితలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడి మృతి

ఎల్కతుర్తి : మద్యం మత్తులో ఆత్మహత్యకు యత్నించిన వృద్ధుడు మృతి చెందిన ఘటన మండలంలోని జీల్గుల గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై జక్కుల పరమేష్ కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లాకు చెందిన భూక్య సుక్య(50) కుటుంబంతో 20 ఏళ్ల క్రితం మండలంలోని జీల్గుల గ్రామానికి వలస వచ్చాడు. ఆయనకు భార్య, ముగ్గురు కూతుర్లున్నారు. పెద్ద కూతురు వివాహం అయ్యింది. మిగతా ఇద్దరు కూతుర్లు చదువుకుంటున్నారు. సుక్య గ్రామంలో కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోష/ంచుకుంటున్నాడు. కొంత కాలంగా మద్యం మత్తులో భార్యతో తరచూ గొడవ పడుతున్నాడు. గురువారం మద్యం మత్తులో పురుగుల మందు తాగడంతో స్థానికులు గమనించి కరీంనగర్ జిల్లాలోని హుజురాబాద్ ఆస్పత్రిలో చేర్చారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి సుక్యాను వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కాగా ఎంజీఎంలో చికిత్స పొందుతున్న సుక్యా పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందాడు. మృతుడి పెద్ద కూతురు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పరామర్శ



పరకాల : వరంగల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొచ్చు వినయ్ కుటుంబాన్ని ఎమ్మెల్సీ పోచంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, రైతు రుణ విమోచన కమిషన్ రాష్ట్ర చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, వికలాంగుల సంస్థ చైర్మన్ వాసుదేవరెడ్డి, హనుమకొండ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, బీఆర్‌ఎస్‌పార్టీ నాయకులు పరామర్శించారు. వినయ్ మృతి చెందిన విషయం తెలిసి నాయకులు పట్టణంలోని ఆయన నివాసానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని ఓదార్చారు.

సీపీఎం బైక్ ర్యాలీ

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే స్టేషన్ వద్ద సీపీఎం నాయకుల బైక్‌ర్యాలీని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం శుక్రవారం ప్రారంభించారు. కాజీపేట జంక్షన్ నుండి చౌరస్తా, ఫాతిమానగర్ మీదుగా హయగ్రీవచారి మైదానంలోని జనచైతన్య యాత్ర సభకు ర్యాలీగా నాయకులు తరలివెళ్లారు.

‘కంటి వెలుగు’ను వినియోగించుకోవాలి



శిబిరాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్

పరకాల : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని 18 ఏళ్లకు పైబడ్డ విద్యార్థులు వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ టి.శేషాంజన్‌స్వామి కోరారు. పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌తో కలిసి మున్సిపల్ కమిషనర్ శేషాంజన్ స్వామి శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు కంటి పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలని చెప్పారు. ప్రభుత్వం ప్రజలకే కాకుండా విద్యార్థులకు పరీక్షలు నిర్వహించడానికి నిర్ణయించిందని తెలిపారు. ఈ క్రమంలోనే పాలిటెక్నిక్ కాలేజీలో శిబిరం ఏర్పాటు చేశామన్నారు. కంటి సమస్యలున్న వారికి ఉచితంగా మందులతోపాటు కళ్లద్దాలు అందజేస్తారని చెప్పారు. అవసరమైతే శస్త్రచికిత్స సైతం చేయిస్తారని వివరించారు. అనంతరం 210 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో లెక్చరర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన



భీమదేవరపల్లిలో పూజ చేస్తున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్



గట్ల నర్సింగాపూర్‌లో క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే

ఎల్కతుర్తి : భీమదేవరపల్లిలో, ఆ మండలంలోని గట్ల నర్సింగాపూర్ గ్రామాల్లో శుక్రవారం బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవాలు నిర్వహించారు. భీమదేవరపల్లిలోని విశ్వనాథ కాలనీలో రాగేళ్ల కృష్ణమూర్తి, గ్రామ పురోహితుడు శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన బొడ్రాయి ప్రతిష్ఠాపనకు హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్, హనుమకొండ జెడ్పీ చైర్మన్ చైర్మన్ మారేపల్లి సుధీర్‌కుమార్ పాల్గొని పూజలు చేశారు. తొలిరోజు గ్రామస్తులు బిందెలతో నీళ్లు తెచ్చి విగ్రహాలకు జలాభిషేకం నిర్వహించారు. అనంతరం అర్చకులు భూతబలి, యాగశాల ప్రవేశం, గణపతి పూజ, పుణ్యాహ వచనం, యంత్రభింభ మార్జలలు, అగ్ని ప్రతిష్ఠాపన, ధ్వజారోహన కార్యక్రమాలు చేపట్టారు. గట్ల నర్సింగాపూర్‌లో బొండ్రాయి ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే పాల్గొని బొడ్రాయికి క్షీరాభికం చేశారు. అనంతరం పోచమ్మ బోనాలు, అమ్మ వారికి నూతన వస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వంగ రవి, ఎంపీపీ జక్కుల అనిత, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉగాది తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నిరంజన్, తదితరులు

ఎల్కతుర్తి : ఆచార్య ప్రభోదానంద యోగీశ్వర్లు ఆశీస్సులతో ముద్రించిన త్రైత సిద్ధాంత ఉగాది తెలుగు క్యాలెండర్‌ను భీమదేవరపల్లిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో, ముల్కనూర్‌లోని ప్రజాగ్రంథాలయంలో త్రైత సిద్ధాంత జ్ఞానవేదిక కమిటీ అధ్యక్షుడు సదా నిరంజన్ సిద్ధాంతి శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఉగాది పండగ నాడు ప్రతిఒక్కరూ భక్తిశ్రద్ధలతో దేవున్ని ఆరాధించాలని కోరారు. తద్వారా భక్తితోపాటు జ్ఞానం పెరుగుతుందని తెలిపారు. ఏటా క్యాలెండర్‌ను ప్రజల సౌకర్యార్థం రూపొందించి విడుదల చేస్తున్నట్టు తెలిపారు. తద్వారా శుభ, అశుభ కార్యక్రమాల నిర్వహణలో క్యాలెండర్ ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో సబ్‌రిజిస్ట్రార్ భాగ్యలక్ష్మీ, గ్రంథాలయ కోశాధికారి వీరేశం, రాణి, శివనారాయణ్ సింగ్, సతీష్‌చారి, రేవతి, స్రవంతి, రాకేష్, సుమన్, కళ్యాణి, రేణుకు, లక్ష్మీ, లింగ మూర్తి, కీర్తన, వంశీకృష్ణ, గణేష్ పాల్గొన్నారు.

అపరిశుభ్రంగా కూరగాయల మార్కెట్

- చిన్నపాటి చినుకులతో అధ్వానంగా తయారైన లక్ష్మీపురం మార్కెట్ పరిసరాలు
- పక్షం రోజులుగా పడకేసిన పారిశుద్ధ్య పనులు



కూరగాయల మార్కెట్ గేటు ముందు పరిస్థితి



బురదలోనే కూరగాయల విక్రయాలు

వరంగల్: తేలికపాటి జల్లులు కురవడంతో వరంగల్ లక్ష్మీపురంలోని మోడల్ కూరగాయల మార్కెట్ అపరిశుభ్రంగా తయారైంది. 10 – 15రోజులుగా మార్కెట్ ప్రధాన రోడ్డుపై పారిశుద్ధ్య పనులు చేయకపోవడంతో మార్కెట్ పరిసర ప్రాంతాలు అధ్వానంగా తయారయ్యాయి. అపరిశుభ్ర వాతావరణంలోనే మార్కెట్‌లోని చిల్లర వ్యాపారులు వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. మురిగిపోయిన కూరగాయలను ఎక్కడపడితే అక్కడ పడవేయడంతో దుర్వాసన వస్తోంది. పరిసరాలను శుభ్రం చేయించాలని మార్కెట్ అధికారులను కోరగా టెండర్లు పిలిచామని, కొత్త కాంట్రాక్టర్ వచ్చాక చేస్తారన్న చెబుతున్నారని వ్యాపారులు తెలిపారు.

వైద్యానికి సర్కారు అధిక ప్రాధాన్యం

హసన్‌పర్తి: వైద్యానికి తెలంగాణ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. హసన్‌పర్తి చెందిన పిట్టల ముక్తీశ్వర్‌కు రూ.2 లక్షలు, సుద్దాల శివమణికి రూ.1.25 లక్షల చొప్పున మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును లబ్ధిదారులకు ఇళ్ల వద్దకు వెళ్లి ఎమ్మెల్యే శుక్రవారం పంపిణీ చేశారు. తొలుత హసన్‌పర్తి మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఆర్యసమాజ్ భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, ఆత్మ చైర్మన్ కందుకూరి చంద్రమోహన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వీసం సురేందర్‌రెడ్డి, చకిలం రాజేశ్వర్‌రావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పిట్టల కుమారస్వామి, దేవస్థాన మాజీ చైర్మన్ పిట్టల సదానందం పాల్గొన్నారు. అలాగే, ఆంజనేయస్వామి దేవస్థాన అర్చకుడు కృష్ణమూర్తిని ఎమ్మెల్యే రమేష్ పరామర్శించారు. ఇటీవల కృష్ణమూర్తి కుమార్తె అనారోగ్యంతో మృతి చెందింది.